సాక్షి నిజామాబాద్


శనివారం ■ 8 ■ ఫిబ్రవరి ■ 2025



పోలింగ్ కేంద్రాల్లో..

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ హనుమంతు అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



పగలు కుప్పలు.. రాత్రి తరలింపు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్‌లో నీరు తగ్గడంతో తేలిన ఇసుకను అక్రమార్కులు తరలిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 32.9 /16.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

గిరిరాజ్ కళాశాలలో ముగిసిన న్యాక్ బృందం పరిశీలన



నిజామాబాద్‌అర్బన్ : గిరిరాజ్ డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడింగ్ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో న్యాక్ బృందం రెండ్రోజులుగా పరిశీలన చేపట్టింది. శుక్రవారం రెండో రోజు ముగ్గురు సభ్యులు కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించారు. కళాశాలలో కొనసాగుతున్న కోర్సులు, విద్యార్థుల వివరాలు, ప్రయోగ పరీక్షల వివరాలు, క్రీడలు, కళాశాలకు సంబంధించిన మౌలిక వసతులు తెలుసుకున్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌తో సమావేశం నిర్వహించారు. న్యాక్ బృందంలో చైర్మన్‌గా రాకేశ్ కుమార్ గుప్తా, సభ్యులుగా హరిచంద్ర రమణే, అనిరుద్ ఉన్నారు. గిరిరాజ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాంమోహన్‌రెడ్డి, అధ్యాపకులు న్యాక్ బృందానికి కళాశాలకు సంబంధించిన వివరాలను అందించారు.

నిజామాబాద్ రైల్వేస్టేషన్ తనిఖీ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను రైల్వే డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి రైళ్లలో దొంగతనాలు జరగకుండా, ప్రయాణికులు క్షేమంగా గమ్యానికి చేరుకునేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రైల్వే ఎస్సై సాయి రెడ్డి ఉన్నారు.

12న అథ్లెటిక్స్ ఎంపికలు


నిజామాబాద్ నాగారం: నాగారంలోని రాజారామ్ స్టేడియంలో ఈనెల 12న నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 16, 18, 20 బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్, రాజాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు 25 మంది అథ్లెటిక్స్‌ని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పరుగు పందెం, డిస్కస్ త్రో, జావలిన్ త్రో, లాంగ్ జంప్, హై జంప్ సహా పలు ఈ వెంట్లలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 11లోపు రూ.100 ఎంట్రీ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99890 40776 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

స్పెల్–2 ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి




నిజామాబాద్ అర్బన్: ఇంటర్ స్పెల్–2 ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశామని, శనివారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని డీఐఈవో రవికుమార్ తెలిపారు. నగరంలో స్పెల్–1 ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్న వెక్టార్, ఎస్‌ఆర్ కళాశాలలతోపాటు సత్య ఒకేషనల్ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల మేరకు ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలను జియో ట్యాగింగ్ చేయాలని, సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాజు



సుశాంత్

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడాకారులు బానోత్ రాజు, చలిగంటి సుశాంత్‌లు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 9వరకు హన్మకొండలో జరిగే 11వ రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పీడీ మర్కంటి గంగామోహన్ తెలిపారు. ఇటీవల ఆర్మూర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు.



వ్యవసాయ క్షేత్రంలో తవ్విన తర్వాత పసుపును వేరు చేస్తున్న కూలీలు

సాగు భారమే..!

పసుపు రైతుల్లో నిరాశ

- దిగుబడి, ధర ఆశాజనకంగా ఉన్నా ఆర్థిక భారమే
- ఆశలు కల్పిస్తున్న జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు

పచ్చి పసుపు విక్రయం..

కొన్ని చోట్ల పసుపు తవ్విన తర్వాత ఉడికించకుండా పచ్చి పసుపును రైతులు విక్రయిస్తుండగా వ్యాపారులు కొనుగోలు చేసుకుని తరలించుకుంటున్నారు. పసుపును ఉడికించుకునే సామర్థ్యం ఉన్న వ్యాపారులు తక్కువ ధరకు పచ్చి పసుపును కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. 10 శాతం వరకు పచ్చి పసుపు విక్రయాలు సాగుతున్నాయని రైతులు తెలిపారు.

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్‌కు చెందిన రైతు దడివె మోహన్ రెండెకరాల్లో పసుపు పంటను సాగు చేశారు. పసుపు ఆకు కోసి తవ్వడం, ఉడికించడం, ఆరబెట్టడం, మార్కెట్‌కు తరలించడానికి ఒక్కో ఎకరానికి ఆయన రూ.50 వేల వరకు ఖర్చు చేశాడు. అంటే రెండెకరాలకు రూ.లక్ష వరకు కేవలం చివరి దశలోనే ఖర్చు చేయాల్సి వచ్చింది. పసుపు సాగు ఆరంభించిన నుంచి ఒక్కో ఎకరానికి రూ.1.10 లక్షల వరకు వెచ్చించాడు. పసుపు సాగు వల్ల లాభం మాట ఎలా ఉన్నా ఖర్చులే తడిసి మోపెడవుతుండటంతో వచ్చే ఏడాది సాగు విస్తీర్ణం తగ్గించాలనే భావనలో సదరు రైతు ఉన్నాడు. ఇది ఒక్క రైతు మోహన్ ఆలోచనే కాదు. పసుపు సాగు చేస్తున్న రైతులు ఖర్చుల భారం భరించలేక సాగు విస్తీర్ణం కుదించే యోచన చేస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డును నిజామాబాద్‌లోనే ప్రారంభించి రైతులకు శుభవార్తను అందించింది. క్షేత్ర స్థాయిలో మాత్రం పసుపు సాగు విస్తీర్ణం తగ్గించే ఆలోచనలో రైతులు ఉండటం గమనార్హం. పసుపు బోర్డు ఏర్పాటైన నేపథ్యంలో ఈ పంట సాగుకు ప్రోత్సాహకాలు అంది సాగు విస్తీర్ణం వృద్ధి చెందుతుందని ఆశాభావంతోనూ రైతులు ఉన్నారు. ప్రస్తుతం మాత్రం భిన్నమైన పరిస్థితులు కనిపిస్తుండటం ఆయోమయానికి గురి చేస్తోంది. పసుపు బోర్డు ప్రారంభం కావడంతో ఈ పంట సాగుపై అధ్యయనం చేసి రైతులు ఖర్చులు తగ్గించుకునేలా సూచనలు, సలహాలు అందించాల్సిన అవసరం అధికార యంత్రాంగంపై ఉంది.

కొద్ది మంది రైతులకే ప్రయోజనం

పసుపు సాగుకు సంబంధించి దిగుబడి పెరిగి, ఆశించిన ధర లభిస్తున్నా కొంత మంది రైతులకే ప్రయోజనం కలుగుతుంది. దిగుబడి తగ్గిన వ్యవసాయ క్షేత్రాల్లో రైతులకు మాత్రం నష్టం తప్పడం లేదు. ఒక్కో ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి లభిస్తుంది. కొన్ని చోట్ల 15 క్వింటాళ్లకు మాత్రమే దిగుబడి పరిమితమై రైతులకు తీరని భారం కలిగింది. పసుపునకు క్వింటాలుకు రూ.10 వేల వరకు ధర లభిస్తుంది. ఈ లెక్కన ఆశించిన దిగుబడి లభించిన రైతులకు ఒక్కో ఎకరానికి రూ.3 లక్షల ఆదాయం మాత్రమే లభిస్తుంది. ఖర్చులు రూ.1.55 లక్షలు మినహాయిస్తే రైతుకు మిగిలేది ఎకరానికి రూ.1.45 లక్షలు మాత్రమే. ఇది కూడా పూర్తి స్థాయిలో దిగుబడి లభించి మంచి ధర వస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. ఈ అన్ని అంశాలను పరిశీలిస్తే ఖర్చుల మోత తగ్గిస్తేనే రైతులకు మేలు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమైతుంది.

పసుపు సాగుకు ఖర్చులు ఇలా.. (రూ.లలో)

సేంద్రియ ఎరువులు, రసాయన ఎరువులు, కూలీల కోసం	1,10,000
పంట చేతికి వచ్చిన తరువాత ఆకు కోయడానికి	5,000
తవ్వడానికి కూలీలకు	7,200
పసుపు రిక్కడానికి	16,000
ఉడికించడానికి	8,500
పాలిషింగ్ కోసం	5,000
మార్కెట్‌కు తరలించడానికి	2,600
మొత్తం	1,54,300



పసుపు ఉడికిస్తున్న కూలీలు

ఖర్చులు తగ్గితేనే ప్రయోజనం



పసుపు సాగులో ఖర్చులు తగ్గితేనే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. సాగు ఖర్చులు గతంలో కంటే ఎక్కువగా పెరగడం వల్ల భారం ఎక్కువై సాగు విస్తీర్ణం తగ్గించాలనే ఆలోచన వస్తోంది. ఇది ప్రమాదకరమైనదే రైతులను ఒక్కతాటిపైకి తీసుకువచ్చి వారి కోసం కొత్త కార్యాచరణ అమలు చేయాలి. – బద్దం రాజశేఖర్, రైతు, తిమ్మాపూర్

పరిగణనలోకి తీసుకోవాలి..



పసుపు సాగుపై వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి పరిశీలన జరిగింది. కమిషన్ సిఫారసును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవాలి. పసుపు బోర్డు ద్వారా రైతులకు మేలు రకమైన విత్తనాలే కాదు, సాగు ఖర్చులు తగ్గించుకునే సూచనలు అందించాల్సి ఉంది.
– సుంకెట్ అన్వేష్‌రెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

బ్రహ్మోస్.. సూపర్‌సోనిక్..

- విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచిన 'ఇన్‌స్పైర్ ఇండియా'
- ఉమెన్స్ కళాశాలలో ముగిసిన ఇస్రో, డీఆర్‌డీవో స్పేస్, డిఫెన్స్ ఎక్స్‌పో
- రెండోరోజూ వేల సంఖ్యలో హాజరైన విద్యార్థులు
- క్షిపణులు, చంద్రయాన్, మంగళయాన్ గురించి తెలుసుకునేందుకు విద్యార్థుల ఉత్సాహం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బ్రహ్మోస్, సూపర్‌సోనిక్ టార్గెట్ ఫర్ యాంటీ రేడియేషన్, మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్.. మరోవైపు చంద్రయాన్, మంగళయాన్ తదితరాల గురించి తెలుసుకునేందుకు విద్యార్థులు ఎనలేని ఉత్సాహం చూపారు. నిజామాబాద్ ఉమెన్స్ కళాశాలలో రెండురోజుల స్పేస్, డిఫెన్స్ ఎక్స్‌పో కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా ముగిసింది. రక్షణశాఖ మంత్రి శాస్త్ర సాంకేతిక సలహాదారు డాక్టర్ జీ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న కలాంస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ ఇండియా కార్యక్రమంలో విద్యార్థులు రెండో రోజూ వేలాదిగా హాజరయ్యారు. విద్యార్థులు ఎక్స్‌పో తిలకిస్తున్న సమయంలోనే చంద్రయాన్–4 ప్రయోగాన్ని 2027లో చేసేందుకు పీఎస్‌ఎల్‌వీ–3ని సిద్ధం చేస్తున్నట్లు ఇస్రో ప్రకటించడంతో విద్యార్థుల్లో ఆసక్తి కలిగింది. రెండోరోజు అదనంగా కీలకమైన బ్రహ్మోస్, సూపర్‌సోనిక్ టార్గెట్ ఫర్ యాంటీ రేడియేషన్, మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ పరికరాలను ఎక్స్‌పోలో ఉంచారు.



బ్రహ్మోస్ క్షిపణి వద్ద విద్యార్థులు

■ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రూపొందించిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ ఆకట్టుకుంది. దీన్ని భారత్, రష్యా ఎయిరోస్పేస్ విభాగాలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. భారత ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లు ఉపయోగించడంతో పాటు వివిధ దేశాలకు ఎగుమతి సైతం చేయడం గమనార్హం. ఈ క్షిపణి ధ్వని వేగానికి మూడురెట్ల వేగంతో వెళుతుంది. భూమి, సముద్ర ఉపరితలం, ఆకాశం, సముద్రం లోపలి భాగం నుంచి సైతం ప్రయోగించగలిగే ఈ క్షిపణి 450 కిలోమీటర్లు. 800 కిలోమీటర్ల రేంజ్‌కు అభివృద్ధి చేస్తున్న దశలో ఉంది. దీన్ని భూమి మీద నుంచి మొబైల్ లాంచర్స్‌తో, సముద్రం మీద వార్ షిప్స్, సముద్రం లోపల నుంచి సబ్‌మెరైన్ నుంచి ఆకాశంలో సుఖోయ్30 ఫైటర్ జెట్ నుంచి ప్రయోగించొచ్చు. ఇది 200 నుంచి 300 కిలోల భారీ ఎక్స్‌ప్లోజివ్స్, న్యూక్లియర్ వెపన్‌ను మోసుకెళ్లగలదు. పిన్‌పాయింటెడ్‌గా కచ్చితంగా శత్రువుల షిప్పులు, బంకర్లు, భారీ టార్గెట్లను ఛేదించలగలదు. విజయవంతమైన ఈ క్షిపణులను ఇప్పటికే ఫిలిప్పీన్స్, యూఏఈ, ఉక్రెయిన్, థాయ్‌లాండ్, మలేషియా, దక్షిణాఫ్రికా, ఇండోనేషియాలకు ఎగుమతులు చేశారు.



స్పేస్, డిఫెన్స్ ఎక్స్‌పోను తిలకించేందుకు భారీగా వచ్చిన విద్యార్థులు



ఎస్‌టీఏఆర్ క్షిపణి

■ సూపర్‌సోనిక్ టార్గెట్ ఫర్ యాంటీ రేడియేషన్ క్షిపణిని డీఆర్‌డీవో అభివృద్ధి చేసింది. ఎల్‌ఎఫ్‌ఆర్‌జే (లిక్విడ్ ఫ్యూయల్ రామ్‌జెట్) ఇంజిన్‌తో సూపర్‌సోనిక్ వేగంతో 175 కిలోమీటర్ల రేంజ్ వరకు వెళ్లి లక్ష్యాన్ని ఛేదించగలదు.

■ థర్డ్ జనరేషన్ ఎంపీఏటీజీఎం (మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్)ను డీఆర్‌డీవో అభివృద్ధి చేయగా భారత్ డైనమిక్స్ లిమిటెడ్ తయారు చేసింది. భారత ఆర్మీ ఉపయోగిస్తున్న ఈ క్షిపణి సాలిడ్ ఫ్యూయల్ రాకెట్ మోటర్‌తో పనిచేస్తుంది. 2.5 కిలోమీటర్ల నుంచి 4 కిలోమీటర్ల రేంజ్‌లో లక్ష్యాలను కొట్టగలదు.



ఎంపీఏటీజీఎం క్షిపణి

నగరంలో ట్రైనీ అధికారుల పర్యటన


- డ్వాక్రా సంఘాలు, ఆస్పత్రులు, పాఠశాలల పరిశీలన
- వివరాలు తెలిపిన మున్సిపల్ అధికారులు

నిజామాబాద్ సిటీ : ఢిల్లీకి చెందిన మిలటరీ ట్రైనీ ఇంజినీరింగ్ సర్వీసెస్ శిక్షణ అధికారులు నిజామాబాద్ నగరంలో రెండోరోజు శుక్రవారం పర్యటించారు. చంద్రశేఖర్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. జన్మభూమి రోడ్డులో డ్వాక్రా సంఘాలు నిర్వహిస్తున్న కుట్టుమిషన్ల కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. రుణాల పంపిణీ, స్వయం సహాయ సంఘాల నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి మెప్మా కార్యక్రమాలను మున్సిపల్ ప్రాజెక్టు అధికారి చిదుర రమేశ్ వివరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రాజేందర్, అసిస్టెంట్ కమిషనర్ జయకుమార్, ఎంహెచ్‌ఆర్‌డీ సూపర్‌వైజర్ విజయానంద్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.




మహిళా శక్తి క్యాంటీన్ వద్ద ట్రైనీ అధికారులు


ఎమ్మెల్సీ స్థానాలకు భారీగా నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి



బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే కేవీఆర్



మాజీ డీఎస్పీ మదనం గంగాధర్

- గ్రాడ్యుయేట్స్‌కి 28, టీచర్స్‌కి 2
- ర్యాలీగా నామినేషన్లు వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్– మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు పోటెత్తాయి. శుక్రవారం మంచిరోజు కావడంతో ఆయా స్థానాలకు పోటీ చేస్తున్న ఆశావహులంతా అనుచరగణంతో భారీ ర్యాలీలుగా వచ్చి నామినేషన్లు వేశారు. శుక్రవారం ఒక్కరోజే గ్రాడ్యుయేట్స్ స్థానానికి 28 మంది నామినేషన్లు వేయగా, టీచర్స్ స్థానానికి రెండు చొప్పున మొత్తం 30 నామపత్రాలు వేశారు. ఈనెల 3న నామినేషన్ల పర్వం మొదలైనప్పటికీ.. ఈ రోజు దాఖలైన నామపత్రాలు అత్యధికం కావడం గమనార్హం. ఉదయం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి నామినేషన్ వేశారు. బీజేపీ నుంచి బరిలో ఉన్న అంజిరెడ్డి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వెంటరాగా.. నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ మేయర్ రవీందర్ సింగ్, ప్రసన్న హరిక్రిష్ణలు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. వీరిలో రవీందర్ సింగ్ సన్నిహితులతో రాగా, హరిక్రిష్ణ అనుచరులు, కళాకారులతో భారీ ర్యాలీగా వచ్చారు. వీరితోపాటు సామాజిక ఉద్యమకారులు బక్క జడ్సన్, సిలివేరు శ్రీకాంత్, ఆర్మూర్‌కు చెందిన మాజీ డీఎస్పీ మదనం గంగాధర్, లక్ష్య స్కూల్స్ అధినేత ముస్తాక్‌అలీ కూడా నామినేషన్ పత్రాలను కలెక్టర్ పమేలాకు అందజేశారు.

నేడు, రేపు సెలవు!

నేడు రెండో శనివారం, రేపు ఆదివారం కావడం వల్ల రెండు రోజులు నామినేషన్ల ప్రక్రియకు సెలవు వచ్చినట్లయింది. ఇక మిగిలింది 10వ తేదీ మాత్రమే. చివరి రోజు కూడా భారీగా నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం ఉంది.

విద్యా ప్రమాణాలు మెరుగు పర్చాలి

- ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలి
- ప్రణాళికాబద్ధంగా సిలబస్ పూర్తిచేయాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ఎస్సెస్సీ వార్షిక పరీక్షలపై ఎంఈవోలు, హెచ్‌ఎంలతో సమీక్ష



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, పక్కన అధికారులు

నిజామాబాద్ అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. పాఠశాలల తనిఖీ సందర్భంగా తాను విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించానని, విద్యా ప్రమాణాలు అసంతృప్తిగా ఉన్నాయని అన్నారు. మార్కులు, గ్రేడ్లు కాకుండా ఉన్నతమైన విద్యను అందించి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదో తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులకు సామాజిక పరిస్థితులపై అవగాహన కల్పిస్తూ, ఇష్టపడి చదువుకోవాలనే కోరికను వారిలో పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నదని, ఇప్పటికే సౌకర్యాలు మెరుగైనట్లు తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా బోధన చేస్తూ సిలబస్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. కేవలం ఉత్తీర్ణులమైతే చాలు అనే భావన విద్యార్థుల్లో ఉండకూడదని, దీంతో ఉన్నత విద్యాభ్యాసంలో వారు వెనుకబడిపోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు. డీఎస్సీ ద్వారా దాదాపు అన్ని పాఠశాలల్లో టీచర్ల ఖాళీలు భర్తీ అయ్యాయని, సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంపై ఉపాధ్యాయులు దృష్టిసారించాలని సూచించారు. అనంతరం అపార్ ఐడీలు జనరేట్ చేయడంలో ముందంజలో నిలిచిన ఐదుగురు హెచ్‌ఎంలను, ప్రతిభ కనబర్చిన ఐదుగురు కాంప్లెక్స్ పాఠశాలల హెచ్‌ఎంలను కలెక్టర్ సత్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఈవో అశోక్, పరీక్షల నియంత్రణ విభాగం అధికారి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని సాలం పాడ్ క్యాంప్, కొప్పర్తి శివారులో పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.12,020 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పదవీకాలం పొడిగింపు



ఖలీల్‌వాడి: పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందించడానికి ఏర్పాటు చేసిన డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులను ఒక సంవత్సరం పొడిగిస్తూ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల, డిఫెన్స్ కౌన్సిల్ రాజుకుమార్ సుబేదార్, ఉదయ్‌కృష్ణ శుభం, ప్రమోద్‌లకు అందజేశారు. జిల్లా కార్యదర్శి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువులో యువకుడి గల్లంతు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువులో ఓ యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్ కాలనీకి చెందిన చిన్నచెవ్వ రాములు అతని చిన్నకొడుకు సాయికుమార్ (24)తో కలిసి శుక్రవారం సాయంత్రం పెద్ద చెరువుకు వెళ్లారు. స్నానం చేసేందుకు సాయికుమార్ చెరువులోకి దిగగా, లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాక గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న దేవునిపల్లి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం ఉదయం తిరిగి గాలింపును ప్రారంభిస్తామని పోలీసులు తెలిపారు.

ఈవీఎం గోదాం సందర్శన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం సందర్శించారు. గోదాంలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును సీసీ ఫుటేజీ ద్వారా తనిఖీ చేశారు. పోలీసు బందో బస్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, తహసీల్దార్ జనార్దన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ, డీటీ అనిల్ పాల్గొన్నారు.

విష ప్రయోగంతో కోళ్లు మృత్యువాత!



వర్ని: మండల కేంద్రంలో సుమారు 30నాటు కోళ్లు విష ప్రయోగంతో మృతిచెందాయి. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. జాకోరా రోడ్డులోని స్పైసీ దాబాలో పాషా అనే వ్యక్తి 30 నాటు కోళ్లను పెంచుకునేవాడు. అవి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో తరచూ వస్తున్నాయని ఆ స్థల యజమాని కిట్టయ్య కోళ్లకు విషం పెట్టి చంపివేసినట్లు బాధితుడు వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యా దు చేశాడు. మృతి చెందిన కోళ్ల విలువ సుమారు రూ.90వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. పోలీసులు విచారణ చేపట్టారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం నాగేంద్ర నగర్‌లోని ఓ తాళం వేసి ఉన్న ఇంటిలో శుక్రవారం వేకువజామున గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. జంగం చిన్న ముత్తెన్న అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా, దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో దాచుకున్న బంగారు, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

పగలు కుప్పలు.. రాత్రి తరలింపు

- ఎస్సారెస్పీలో జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు
- ఆనకట్టకు పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని అధికారులు



ప్రాజెక్ట్‌లో నీటి అంచున వేసిన ఇసుక కుప్పలు

బాల్కొండ: శ్రీరాంసాగర్ జలాశయంలో క్రమంగా నీటిమట్టం తగ్గుతుండడంతో ఇసుక అక్రమ తవ్వకాలు జోరందుకున్నాయి. పగలంతా కుప్పలుగా చేస్తూ రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, ఇష్టారీతిన చేపడుతున్న తవ్వకాలతో ఆనకట్టకు ముప్పు పొంచి ఉన్నది. బ్యాక్ వాటర్ ప్రాంతంలోని ఇసుక తరలింపుతో ఇబ్బంది లేకపోయినప్పటికీ ఆనకట్ట రివిట్‌మెంట్ నుంచి ఇసుక తవ్వకాలు చేపడుతుండడంతో ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది.

ఆనకట్టకు గండి ముప్పు!

ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదతో భారీగా మట్టి కొట్టుకువస్తుంది. నీటి అలలు ఆనకట్ట రివిట్‌మెంట్‌ను తాకిన సమయంలో ఆ మట్టి కాస్తా ఇసుకగా మారి బండరాళ్ల మధ్యలోకి చేరుతుంది. ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గగానే ఆ బండరాళ్ల మధ్య ఉన్న ఇసుకను పగటివేళల్లో చిన్న చిన్న కుప్పలు చేసుకొని రాత్రివేళల్లో ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రివిట్‌మెంట్ పక్క నుంచి ఇసుక తరలించడంతో ఆనకట్టకు గండి పడే ప్రమాదం లేకపోలేదు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రధానంగా లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్‌కు ఇరువైపులా ఇసుక కుప్పలు చేసి పెట్టారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక తవ్వకాలను నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఆగని మొరం, మట్టి తవ్వకాలు..

ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం నుంచి మొరం, మట్టి తవ్వకాలు ఆగడం లేదు. నీటి మట్టం తగ్గుతుండడంతోనే రైతుల పేరిట వ్యాపారులు మొరం తవ్వకాలకు తెరలేపుతున్నారు. పెద్ద పెద్ద గుంతలు తవ్వుతూ మట్టి, మొరం తరలిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. మొరం, మట్టి తవ్వకాలతో ఎస్సారెస్పీలో పూడిక పోతుందనే భావనలో ఉన్నారు. కానీ, ఇష్టారీతిన తవ్వుతున్న గుంతలతో ప్రమాదాలు సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

అడ్డుకుంటాం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో రాత్రివేళల్లో ఇసుకను తరలిస్తున్నట్లు తెలిసింది. ప్రాజెక్ట్ లోపలి నుంచి ఇసుకను తీస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. ఆనకట్ట వెంట లష్కర్లను తిప్పుతున్నాం. ఇసుక, మొరం తవ్వకాలను అడ్డుకుంటాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



పెర్కిట్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సౌకర్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

మోర్తాడ్/పెర్కిట్(ఆర్మూర్): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారం బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని భీమ్‌గల్, వేల్పూర్, పెర్కిట్ ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆయన సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. భీమ్‌గల్ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసిన దుప్పట్లు, కాస్మెటిక్ కిట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బోధన తీరును పరిశీలించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, అధికారులు ఉన్నారు.

ఆర్మూర్‌లో కుక్కల పట్టివేత



ఆర్మూర్: పట్టణంలోని పలు కాలనీల్లో శుక్రవారం కుక్కలను మున్సిపల్ సిబ్బంది పట్టుకున్నారు. పట్టణంలో ఇటీవల కుక్కలు దాడులు చేసి పలువురికి గాయపరిచాయి. ఈనేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు ఆయా కాలనీల్లో కుక్కలను సిబ్బంది పట్టుకొని, సమీపంలోని అటవీ ప్రాంతాలకు తరలించారు.

మహిళా సాధికారత కోసం కృషి

నిజామాబాద్‌అర్బన్: మహిళా సాధికారత కోసం విద్యా కమిషన్ ద్వారా అనేక సంస్కరణలు తీసుకురానున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ కేవీఎల్ విశ్వేశ్వర రావు అన్నారు. నగరంలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో శుక్రవారం ఆయన వెబ్ సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన మహిళల విద్య కోసం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ నివేదిక రూపకల్పన చేసే పనిలో ఉన్నామన్నారు. గిరిజన మహిళల్లో ఉన్నత విద్యాభ్యాసం మరింత పెంచేందుకు తీవ్రమైన కృషి చేస్తామని వెల్లడించారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లెక్చరర్ మౌనిక వెబ్ సెషన్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపల్ సైదా జైనబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్లను టీకాలతో నివారించవచ్చు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి/నిజామాబాద్ రూరల్: క్యాన్సర్లను వ్యాక్సిన్లతో నివారించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతా కుంచాల అన్నారు. నగర శివారులోని ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రిలో శుక్రవారం నిజామాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో బాలసదన్ చిన్నారులకు క్యాన్సర్ నిరోధక టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్యాన్సర్లు ప్రధానంగా జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వాతావరణ కాలుష్య కారణాల వల్ల అధికంగా వస్తున్నాయన్నారు. మహిళల్లో 90 శాతం వరకు గర్భసంచి క్యాన్సర్లు, రొమ్ము క్యాన్సర్లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. వారికి క్యాన్సర్ నిరోధక వ్యాక్సిన్‌లను ఇవ్వటంతో క్యాన్సర్ల నుంచి కాపాడవచ్చన్నారు. ఐఎంఏ నిజామాబాద్ జిల్లా బాధ్యుడు రవీంద్రసూరి, రవి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం సరళా, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సూపరింటెండెంట్ శైలజ, బాలసదన్ సూపరింటెండెంట్ వినోద తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఖలీల్‌వాడి: ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాలు ఇలా.. నవీపేట్ మండలంలోని పోతంగల్ గ్రామానికి చెందిన శంకర్ (58) కుటుంబంతో సహా ఎనిమిది నెలల క్రితం నగరానికి వలస వచ్చారు. ఎల్లమ్మగుట్ట అమ్మ వెంచర్‌లో వాచ్‌మెన్‌గా ఉద్యోగం చేస్తూ, జీవనం సాగించేవాడు. ఇంటి నిర్మాణం, కూతురు పెళ్లికి అప్పులు చేయగా, బాకీలు తీర్చుకోలేనని మనోవేదన చెందేవాడు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం అతడు పురుగుల మందు తాగి, ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య నర్సుబాయి ఫిర్యాదు మేరకుకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

కంజర్ గ్రామంలో మరొకరు..

మోపాల్: మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన మిద్దె విశాల్ (20) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. వివరాలు ఇలా.. గత నెలలో విశాల్, నిఖిలేష్, అరవింద్ మధ్య వ్యక్తిగత విషయాల్లో ఘర్షణ జరిగింది. దాడిలో నిఖిలేష్‌పై విశాల్ దాడి చేయగా, నిఖిలేష్ చేయి విరిగింది. కుటుంబ సభ్యులు విశాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయగా, రాజీ కోసం కుల పెద్దలు పంచాయితీ పెట్టారు. దీంతో మనస్తాపానికి గురైన విశాల్ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని గమనించి ఆస్పత్రికి తరలించగా, చికిత్స అందించడంతో ఆరోగ్యం కొద్దిగా మెరుగుపడింది. మళ్లీ మూడ్రోజుల క్రితం అనారోగ్యానికి గురి కాగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి శుక్రవారం అతడు మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



విశాల్ (ఫైల్)


రూరల్ మండలంలో ముగ్గురి అదృశ్యం

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు మహిళలు అదృశ్యమయ్యారు. వేర్వేరు రోజులలో వారు అదృశ్యమవగా శుక్రవారం వెలుగులోకి వచ్చాయి. రూరల్ ఎస్సై–2 ఆనంద్‌సాగర్ తెలిపిన వివరాలు ఇలా.. కంఠేశ్వర్ ప్రాంతానికి చెందిన గుండ్ల రాధ(50) రెండు రోజుల కిందట విద్యుత్‌నగర్‌లో ఉన్న తన చెల్లెలు ఇంటికి వెళ్లివస్తానని చెప్పి, ఇంత వరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం రాధ కూతురు నాగజ్యోతి రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

గుండారం గ్రామానికి చెందిన కుంచపు లక్ష్మీ(35) కుటుంబ కలహాల కారణంగా రెండు రోజుల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయి, ఇంతవరకు తిరిగిరాలేదు. భర్త ఎల్లయ్య ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.


చంద్రశేఖర్‌కాలనీకి చెందిన నూలపెల్లి భాగ్యలక్ష్మీ (20) శుక్రవారం ఉదయం మెడికల్ షాపుకు వెళ్లివస్తానని చెప్పి ఇంతవరకు ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇందల్వాయి మండలంలో..



ఇందల్వాయి:మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అగ్గు వంశీ(27) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వంశీ శుక్రవారం ఉదయం కుటుంబ కలహాల కారణంగా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఇప్పటికీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వంశీ ఎరుపు గీతలు, ముదురు నీలిరంగు షర్ట్, తెలుపు రంగు ప్యాంట్ ధరించాడని, ఎవరైనా ఆచూకీ తెలిసినచో ఇందల్వాయి ఎస్సై 87126 59854, డిచ్‌పల్లి సీఐ–87126 59851కు సమాచారం అందించాలని కోరారు.

సదాశివనగర్‌లో వృద్ధురాలి ఆత్మహత్య



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాలు ఇలా.. సదాశివనగర్‌కు చెందిన బాయికాడి సుశీల(70) గత కొన్ని రోజులుగా లింపోమా క్యాన్సర్‌తో బాధ పడుతుంది. ఆస్పత్రిలో చూపించిన వ్యాధి నయంకాకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. ఈక్రమంలో గ్రామ శివారులోని బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చెట్లను నరికిన వ్యక్తిపై కేసు నమోదు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని రాంపూర్‌గడ్డ తండా పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరికివేసిన పిట్లరాములుపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన చెట్లను నరికివేసినట్లు గ్రామస్తులు గుర్తించి, జీపీ కార్యాదర్శి దృష్టికి తీసుకువచ్చారు. కార్యదర్శి ప్రకృతివనంను పరిశీలించి అధికారులకు సమాచారం ఇచ్చారు. కార్యదర్శి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేశామని, అదే గ్రామానికి చెందిన పిట్ల రాములు అనే వ్యక్తి చెట్లను నరికివేసినట్లు తేలిందన్నారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీ బంగారం మణపురం, ముత్తుట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9177555694 స్పాట్ క్యాష్

[SCA25001519]

WANTED

■ Wanted any Degree holder to work in Field Investigation (FI) across AP & TS in a reputed audit firm. Interested persons (male only) send bio data mail kowthahr@gmail.com ✆ 70323 71423 / 99639 75952

[B-489]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

నిజామాబాద్

CONTACT: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతారా?



బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, పాల్గొన్న మాజీ మేయర్ నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు

- అధికారులు, పోలీసుల పేర్లు రెడ్‌బుక్కులో నమోదు చేస్తా
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్: అధికార పార్టీ నేతలకు అధికారులు, పోలీసులు వత్తాసు పలుకుతారా.. మీరందరి పేర్లను రెడ్‌బుక్‌లో నమోదు చేసుకుంటున్నా అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వారి సంగతి చూస్తానని అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు, అధికారులు వేధిస్తున్నారని వారందరి సంగతి చూస్తామన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి అల్జీమర్ వ్యాధి వచ్చిందన్నారు. ఆరు గ్యారంటీలకు సంబంధించి కాంగ్రెస్ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు తరిమికొట్టాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చివరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ అవినీతి బంధం కొనసాగుతుందన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి కుమ్మక్కై ఆర్మూర్‌ను దోచుకుంటున్నారన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కిన కాంగ్రెస్‌ను ప్రజలు తరిమికొట్టాలన్నారు. ఆర్మూర్‌లో కుక్కలు చిన్నపిల్లలపై దాడులు చేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ మేయర్ నీతుకిరణ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీ కులగణన పేరుతో కాంగ్రెస్ కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలుచేయాలి
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: బీసీ కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద కుట్ర చేస్తుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1.85కోట్లకుపైగా అంటే 51శాతం బీసీలుంటే.. కాంగ్రెస్ లెక్కల ప్రకారం 1.65 కోట్లు అంటే 46.25శాతం ఉన్నారని తెలిపారు. దాదాపు 21లక్షల మంది బీసీలు ఏమయ్యారని ప్రశ్నించారు. దీనివల్ల లక్షల బీసీ కుటుంబాలు రిజర్వేషన్లు కోల్పోయే ప్రమాదముందన్నారు. బీసీలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బీసీల్లో హిందువులు, ముస్లింలు ఉంటారా అని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గాన్ని ప్రశ్నించారు. కులగణనకు అసెంబ్లీ ఆమోదం, తీర్మానాలు చేసి పంపితే కేంద్రం ఎందుకు ఆమోదం తెలుపుతుందని ప్రశ్నించారు. బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమల్జేయాలని, అందుకు బీజేపీ వ్యతిరేకం కాదన్నారు. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం బీసీల సంక్షేమానికి ఏడాదికి రూ.20వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.6వేల కోట్ల బకాయిల వల్ల బీసీ విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి డిక్లరేషన్‌లో వారికిచ్చిన హామీలన్నింటిని అమల్జేసి, ప్రజాక్షేత్రంలో ఓట్లు అడగాలని డిమాండ్‌చేశారు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. నాయకులు గోపిడి స్రవంతిరెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మాదాసు స్వామి యాదవ్, సుక్క మధు, తారక్ వేణు, భూపతి, తదితరులు పాల్గొన్నారు.

దోషాలు తొలగిస్తామంటూ అపరిచితుల ప్రచారం

- దేహశుద్ధి చేసిన కోమట్‌పల్లి గ్రామస్తులు



అపరిచిత వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇంటి దోషాలు, కుటుంబ సభ్యుల దోషాలు తొలగించి, శుభాలు కలిగేలా తాయిత్తులు కడుతామని ప్రచారం చేస్తున్న అపరిచితులకు గ్రామస్తులు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలోని కోమట్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కోమట్‌పల్లి గ్రామానికి శుక్రవారం షిఫ్ట్ కారులో ఐదుగురు అపరిచితులు వచ్చారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఇంటి దోషాలు, కుటుంబ సభ్యుల దోషాలు తొలగించడానికి వాస్తు ప్రకారం తాయిత్తులు కట్టి దోష నివారణ చేస్తామంటూ ప్రచారం చేశారు. పలువురి ఇళ్లకు వెళ్లి వాస్తు బాగాలేదని నమ్మబలికి కొంత డబ్బులు తీసుకున్నారు. కొందరు వారిపై అనుమానం వచ్చి గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. కొంత మంది యువకులు, గ్రామ పెద్దలు వారిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారిని విచారించగా కరీంనగర్ జిల్లా సిరిసిల్లా మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెందిన చల్ల శంకర్, బొమ్మెర సంతోష్, మఠం ప్రవీణ్, మఠం అశోక్, బొమ్మెర అంజనేయులుగా గుర్తించారు. వీరంతా కలిసి ఉదయం కోమట్‌పల్లి గ్రామానికి వచ్చినట్లు ఒప్పుకున్నారు. డబ్బుల కోసం ఈ పనికి ఒడిగట్టినట్లు తెలిపారు. ఎస్‌హెచ్‌వో ప్రకాష్‌నాయక్ ఐదుగురిని తహసీల్దార్ నరేందర్‌గౌడ్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలో డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ 17మంది పట్టుబడినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. వారికి నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి, అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరురిచామన్నారు. వారిలో 11మందికి రూ.15,500 జరిమానా, ఆరుగురికి రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు తెలిపారు.

ఆర్మూర్ మండలంలో..

పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల మామిడిపల్లి చౌరస్తాలో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఆదిలాబాద్ జిల్లా మామడ మండలం న్యూ సంఘ్వీ గ్రామానికి చెందిన బోస్ రాజశేఖర్ మద్యం తాగి వాహనం నడుపుతు పట్టుబడ్డాడు. దీంతో రాజశేఖర్‌ను ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుచగా జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

డయల్100ను దుర్వినియోగం చేసిన వ్యక్తుల బైండోవర్


మద్నూర్: మద్యం తాగి డయల్ 100కు కాల్ చేసి న్యూసెన్స్ చేసిన ఇద్దరిని శుక్రవారం తహసీల్దార్ ఎండీ ముజీబ్ ఎదుట అధికారులు బైండోవర్ చేశారు. గ్రామానికి చెందిన వడ్డేవార్ గజానంద్, అవార్‌వార్ గంగాధర్‌లు అతిగా మద్యంతాగి ఇటీవల డయల్ 100కు ఫోన్ చేసి, పోలీసుల సమయాన్ని దుర్వినియోగం చేశారన్నారు. దీంతో వారిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం



ఖలీల్‌వాడి: నగరంలోని కోటగల్లీలోగల రెండు ఇళ్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం అయినట్లు ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు తెలిపారు. కాలనీలోని సుమలత, ప్రసాద్‌లకు సంబంధించిన ఇళ్లలో శుక్రవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు బయట పరుగులు తీశారు. మంటలు వ్యాపించడంతో ఆయా ఇళ్లలోని రూ. 3లక్షల నగదు, 10 తులాల బంగారం, 15 తులాల వెండి, ఇంటి సామగ్రి కాలి బూడిదయింది. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా, ఫైర్ ఇంజిన్ వచ్చేవరకు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఘటన స్థలాన్ని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పరిశీలించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని అబ్దుల్లా అనే వ్యక్తికి చెందిన స్క్రాప్ దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగినట్లు స్థానికులు శుక్రవారం తెలిపారు. దుకాణంలోనుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు సకాలంలో వచ్చి మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు స్క్రాప్ దుకాణాన్ని జనావాసాల నుంచి దూరంగా తరలించాలని కాలనీవాసులు కోరుతున్నారు.